

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 166 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 17, మే 2026 | పేజీలు 6 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# విద్యా చట్టానికి ఊపిరినిద్దాం !

## దేశంలో మారుతున్న విద్యా సమీకరణాలు

- జాతీయ విద్యా విధానంలో తాండవిస్తున్న విద్యా మార్పులు
- దేశ విద్యార్థులకు దూరమవుతున్న విద్యా ప్రమాణాలు
- దేశ రాజకీయాల్లో విద్యా ప్రభావం తగ్గిపోతుంది
- నూతన విద్యా విధానంతో ధనికులకే లాభం
- దేశ వ్యాప్తంగా ఇంచుమించు లక్ష విద్యా పాఠశాలలు మూతపడ్డాయి
- తెలంగాణలో విద్యా వారోత్సవాలు విద్యాభివృద్ధి కోసమేనా !
- ఆంధ్రాలో అణిచివేయబడుతున్న విద్యాసంస్థలు
- దేశవ్యాప్తంగా ఉరకలేస్తున్న ప్రైవేటు ఉన్నత విద్యారంగం
- విద్యా సదుపాయాల కన్నా మతం, కులం ప్రాబల్యమే పెరిగిపోతుంది
- విద్య అభివృద్ధిని ఒక వ్యసనం లాగా పెంపొందించబడాలి

డాక్టర్ బరిగెల శివ






డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలు తగ్గిపోతుండడం దేశ పరిజ్ఞానాన్ని రూపుమాపడమేనని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. దేశం అభివృద్ధిలో భాగమైన జాతీయ ఉన్నత విద్యా విధానాలు పూర్తిస్థాయిలో మార్చబడుతుండడం యూజిసి ఏర్పాటు చేస్తున్న విద్యా మార్గాలు కేవలం పట్టణ ప్రాంతాలకు మాత్రమే ఉపయోగకరంగా ఉంటున్నాయని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయన్నారు. పాఠశాల విద్యా మొదలుకొని ఉన్నత విద్య వరకు విద్యా వ్యవస్థలలో మార్చబడుతున్న విద్యా సమీకరణాలు గ్రామస్థాయి ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండాల్సింది పోయి గ్రామస్థాయి ప్రాంతాల ప్రజలను,విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా ఉంటున్నాయని అంతటి కఠినాత్మకమైన విద్యా ప్రమాణాలను రూపొందించడం వల్ల దేశంలో విద్య కన్నా కులమతాలకు ఎక్కువ ప్రాధాన్యత సంతరించబడి వ్యాప్తి చెందుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుండడం పేద విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేసే కుట్రలు దినదినం పెరిగిపోతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పథంలో వ్యాప్తి చెందాల్సిన ప్రభుత్వ విద్య ఇంచుమించు లక్ష సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడుతుండడం దేశ పరిజ్ఞానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. దేశంలో గ్యాస్ ధరలు మొదలుకొని ఇంధనం ధరలు మొదలుకొని నిత్యవసరల ధరలు జిఎస్టి ల ధరలు పెరుగుతున్న కొద్దీ విద్యా ప్రమాణంలో వ్యత్యాసాలు కూడా నిత్యవసర సరుకులు లాగా మార్చబడుతూ పెరిగిపోతుండడం బాధాకరంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడ చూసినా ప్రభుత్వ విద్య కన్నా మతపరమైన ఆలయాల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించితే తప్ప దేశంలో విద్యా ప్రమాణాలకు

- మిగతా 2లో..

## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి: ప్రధాని మోదీకి కవిత లేఖ

- ప్రధాని మోదీకి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత లేఖ
- కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను తొలగించాలని డిమాండ్
- కుమారుడిపై పోక్సో కేసు నమోదు కావడమే ఇందుకు కారణం
- హోం శాఖ మంత్రిగా ఉంటే దర్యాప్తు ప్రభావితమవుతుందని ఆరోపణ
- నిష్పక్షపాత విచారణ కోసం బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి

6



## తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'..

- జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ
- జూన్ 25 నుంచి జులై 24 వరకు వెరిఫికేషన్ ప్రక్రియ
- ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు
- జులై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల
- జులై 31-ఆగస్టు 30 మధ్య అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా



6

## ఎన్నారైకి రూ.24 కోట్ల మేర టోకరా వేసిన తెలంగాణ నేత!

6

## బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశాం: సైబరాబాద్ సీపీ

- నార్సింగిలోని పోలీస్ అకాడమీ వద్ద అరెస్టు చేసినట్లు వెల్లడి
- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామన్న సీపీ
- ఈ నెల 8న బండి భగీరథ్‌పై పోక్సో కేసు



4



## తార్నాకలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఘన సన్మానం

ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ బరిగెల శివ, ఎస్.ఎస్ రాజు

హైద్రాబాద్, 16 మే 2026(జై భీమ్ న్యూస్)

హైదరాబాద్‌లోని తార్నాకలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జైభీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ, రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ ఉద్యోగుల కష్టానికి గౌరవం ఇవ్వడం ప్రతి సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే సంస్థలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఎస్.ఎస్ రాజు మాట్లాడుతూ ఉద్యోగుల అంకితభావమే సంస్థ విజయానికి ప్రధాన బలం అని తెలిపారు. ఉద్యోగులు సమష్టిగా కృషి చేస్తే సంస్థలు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, స్మారక చిహ్నాలు అందజేసి ఘనంగా సత్కరించారు. పాల్గొన్న అతిథులు ఉద్యోగులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ఎల్కతుర్తి మండలంలో కాలువల దుస్థితి

**వరద ముప్పు పొంచి ఉందని ఎంఆర్ఓకు బీజేపీ నాయకుల వినతి**






**హన్మకొండ జిల్లా/ఎల్కతుర్తి, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని గ్రామాల్లో గొలుసుకట్టు కాలువలు, పిల్ల కాలువల దుస్థితిపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని 20 గ్రామాల్లో కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టి, ముంపు నివారణ చర్యలు తక్షణమే ప్రారంభించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు చెరువుల నుంచి వచ్చే అదనపు నీరు గొలుసుకట్టు కాలువల ద్వారా సాఫీగా వెళ్లేదని తెలిపారు. కానీ ప్రస్తుతం కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోవడం, కొంతమంది ఆక్రమణలకు పాల్పడడం వల్ల నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందన్నారు. దీంతో ప్రతి వర్షాకాలంలో గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బావుల సమీపంలోని కెనాల్ కాలువలు, చిన్న పిల్ల కాలువలు పూర్తిగా మూసుకుపోయిన పరిస్థితి ఉందని తెలిపారు. ఈ కాలువల్లో పూడిక తొలగించి, మరమ్మతులు చేపట్టకపోతే భారీ వర్షాల సమయంలో వరద ముప్పు పెరిగే అవకాశముందని హెచ్చరించారు. కాలువలు సక్రమంగా లేకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయి రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రజల ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని, కాలువల శుభ్రపరిచే పనులు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తక్షణ స్పందన ఇవ్వాలని కోరిన శ్రీకాంత్ యాదవ్, మండల ప్రజల తరఫున ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని కూడా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, కొడం రమేష్, మాటూరు విద్యాసాగర్, చీరాల రంజిత్, సూదిరెడ్డి సాయిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య**

**ములుగు, మే 16, 2026(జై భీమ్ న్యూస్)**



ములుగు జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు 2026--27 విద్యా సంవత్సరానికి "బెస్ట్ అవైలబుల్ స్కూల్స్" పథకం కింద 1వ తరగతి మరియు 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం కింద జిల్లాకు 1వ తరగతికి 20 సీట్లు, 5వ తరగతికి 22 సీట్లు కేటాయించబడినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఎంపిక చేయబడిన పాఠశాలల్లో కమలాపురంలోని ఆదర్శ హై స్కూల్ (ఇంగ్లీష్ మీడియం -- డే స్కాలర్), ములుగులోని సాధన హై స్కూల్ (డే స్కాలర్), శ్రీ అరవింద విద్యా మందిర్ హై స్కూల్ (డే స్కాలర్), సన్ రైసర్స్ హై స్కూల్ (డే స్కాలర్ / రెసిడెన్షియల్) ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి ఒక కుటుంబం నుండి ఒక్క విద్యార్థి మాత్రమే అర్హుడని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000/- లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000/- లోపు ఉండాలని తెలిపారు. 1వ తరగతికి దరఖాస్తు చేసే విద్యార్థులు 01.06.2020 నుండి 30.06.2021 మధ్య జన్మించి ఉండాలని, ఇందుకు జనన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. 5వ తరగతికి దరఖాస్తు చేసే విద్యార్థులు 4వ తరగతి స్టడీ సర్టిఫికేట్ జతచేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, మీ-సేవ ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలు, మూడు పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలు, గత విద్యా సంవత్సరపు మార్కుల మెమో జిరాక్స్ కాపీ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ములుగు జిల్లా సంక్షేమ భవనంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం నుండి దరఖాస్తు ఫారములు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య కోరారు.

# విద్యా చట్టానికి ఊపిరినిద్దాం

మొదటి పేజీ తరువాయి

సరియైన హక్కులు కల్పించబడేలా లేవని గుర్తు చేశారు.విద్యా అభివృద్ధితో వికసించాల్సిన విద్యా వెలుగులు అభివృద్ధికి నోచుకోకపోవడం అంతుచిక్కని అనుమానాలను రేకెత్తిస్తుందని వివరించారు. యూజీసి రూపొందించిన జాతీయ నూతన విద్యా విధానం పేద ప్రజలపై పేద విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడే విధంగా ఉందని తెలుపుతూ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను యూజీసీ రూపొందించిన నూతన విద్యా విధానాలను అనుసరించాలని ప్రతి రాష్ట్రంలోని విద్యా సైలబస్ మార్పు కోసం ప్రభుత్వాలను ఒత్తిడి తీసుకురావడమే కాకుండా అన్ని రాష్ట్రాల విద్యా విధానాలను విద్యాశాఖలను కేంద్రం గుప్పిట్లోనికి తీసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు.కేంద్ర మంత్రుల్లో చాలా మట్టుకు మంత్రులు ఉన్నత విద్యను అభ్యసించిన దాఖలాలు లేకపోవడం దేశంలోని విద్యాభివృద్ధిపై మక్కువ చూపడం లేదని మొత్తం మీదుగా దేశంలో పరిజ్ఞానవంతులకు మేధావులకు పండితులకు శాస్త్రులకు అవకాశం లేకుండా దేశాన్ని వెనుకబాటుతనానికి నెట్టి వేయడం కోసం విద్యా పరిజ్ఞానాన్ని దేశ ప్రజలకు దూరం చేస్తే సరిపోతుందని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు యూజీసీని ఆయుధంగా వాడుకుంటూ పేద విద్యార్థుల పొట్టగొడుతుందని తీవ్రంగా హెచ్చరించారు.కేంద్రం నుండి ప్రతి రాష్ట్రానికి విద్యా శాఖల పరిపాలన కోసం కేటాయిస్తున్న నిధులు శాతం ఎంతో కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాలపై అజమాయిషి చేసే ముందు రాష్ట్రాల విద్యాభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు ఎన్నో కూడా చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద లేదా అంటూ సూటిగా నిలదీశారు.దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ విద్యా సంస్థలకు సకాలంలో నిధులు అందకపోవడం వల్ల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అవుతున్నాయని విమర్శించారు.దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు వైద్య సీటు అర్హత పరీక్షకు హాజరుకాగా నీట్ పరీక్ష పూర్తయిన తర్వాత పేపర్ లీక్ కేసులో బిజెపి నేత అంటూ రాజస్థాన్ కు చెందిన బిజెపి యువ నాయకుడు దినేష్ బివాల్ అతని సోదరుని అరెస్టు చేయడం దేశ విద్య భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసే విధంగా తయారు చేయబడిందని నిలదీశారు.కొన్ని ప్రాంతాల్లో విద్యా మేధావులు నీటి పరీక్షను సరిగా నిర్వహించలేని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను ఏవిస్తంగా పాలిస్తుందంటూ తీవ్రంగా నిందిస్తున్నారు అని గుర్తు చేశారు.ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్ష మధ్యంతరంగా నిలిపివేయబడడం విద్యార్థులను తీవ్రమైన నిరాశకు గురిచేసిందని హెచ్చరించారు.పైగా బీజేపీ నేతలు కొంతమంది అట్టి ప్రశ్న పత్ర లీకేజ్ ను సమర్థించుకుంటూ సోషల్ మీడియాలో మాట్లాడుతూ ఉండడం వికారంగా ఉందన్నారు.దీన్ని బట్టి చూస్తే దేశంలో విద్యా వ్యవస్థను సమూలంగా నాశనం చేయడం కొరకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడ్డట్లుగా ఉందని అర్థమైపోతుందన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని భారత రాజ్యాంగం తెలుపుతుండగా.దేశ భవిష్యత్తు వృద్ధుల చేతిలోకి తీసుకొని యువతను నాశనం చేసే పనిలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు ముందుకు సాగుతూ ఉండడం దేశ ప్రజలు గమనించాలన్నారు.పనికట్టుకొని ప్రయోగాత్మకంగా విద్యా మూలాలను సమూలంగా నాశనం చేయడం కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని దేశ ప్రజలందరూ నిలదీసే పరిస్థితిలు ఎదురయ్యాయన్నారు.

**రాష్ట్ర విద్యలో రాజకీయ ప్రభావం**

**రాష్ట్ర విద్యా వ్యవస్థలో విద్యా వారోత్సవాలు**

**ఆంధ్ర విద్య అంతరించిపోతుంది**

తెలుగు రాష్ట్రాల్లో విద్యాహక్కులను నశింపజేస్తున్న అధికారులను, ప్రభుత్వ పెద్దలను తెలంగాణ ప్రజలు, ఆంధ్ర ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాస్త కూసో విద్య కాస్త నిలకడగా ముందుకు సాగుతున్న ఆంధ్రాలో మాత్రం పూర్తిగా విద్యావ్యవస్థను సమూలంగా నాశనం చేసే స్థితికి దిగజార్చారని ప్రభుత్వాన్ని సూటిగా నిలదీశారు.ఇరు రాష్ట్రాల ప్రభుత్వ హాస్టల్స్ లలో మౌలిక వసతులు కల్పించబడడం లేదంటూ ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తీవ్రమైన అంతరాయాలు సృష్టిస్తూ వేధింపులకు గురి చేయడం ప్రభుత్వాలకు తగదన్నారు.పత్రికా ప్రకటనలకే పరిమితమవుతున్న విద్యా విధానాలు భౌతిక స్థితికి చేరేవరకు ఎంతో భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయని పేపర్ రూపంలో వస్తున్న అభివృద్ధి భౌతికంగా కనిపించడం లేదంటూ దానికి మూల కారణం ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలుపుతూనే నిధుల మంజూరును నిలుపుదల చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని అన్ని విశ్వవిద్యాలయాల్లో సీసీ కెమెరాలు సెంట్రలైజేషన్ ఏర్పాటు చేయాలని ప్రస్తుతానికి రెండు రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో సిసి కెమెరాలు విద్యార్థినిలపై మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వ్యక్తులు,మహిళా వేధింపుల కేసుల్లో జైలుకు వెళ్ళి వచ్చిన వ్యక్తులు వాడుతున్నారని వాటిని నియంత్రించడం కోసం ఉన్నతాధికారులు ప్రయత్నాలు సాగకుండా పోతున్నాయని తీవ్రంగా విమర్శించారు.మహిళా వేధింపుల కేసుల్లో ఇరుక్కొని జైలు జీవితాలు అనుభవించిన ప్రతి ఉద్యోగిని విద్యాసంస్థ నుండి తొలగించే నూతన చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను కోరారు.ఎక్కడ చూసినా హాస్టల్ భోజనాల్లో నాసిరకం పెరిగిపోతుందని అన్ని విశ్వవిద్యాలయాల్లో హాస్టల్ విధానం నూతనంగా మార్చబడాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ సాధ్యమైనంత మేరకు సకాలంలో కట్టబడి పూర్తి చేయబడాలని వాటి వల్ల ప్రతి ఏటా సుమారుగా రెండు లక్షల 50 వేల మంది పేద విద్యార్థులకు మౌలిక వసతులతో కూడిన నూతన విద్యను అందించే సౌకర్యం లభించబడుతుందని గుర్తు చేశారు.వాటితోపాటు శిథిలావస్థలో ఉన్న గురుకులాలను ఉన్న పాటుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు గురుకులాల్లో చదువుకుంటుండగా తెలుగు రాష్ట్రాల్లో గురుకులాలకు ప్రాధాన్యతను తగ్గిస్తూ ప్రభుత్వాలు చేస్తున్న వ్యతిరేక నిర్ణయాల వల్ల పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న సంగతిని ప్రభుత్వాలు మర్చిపోవద్దు అన్నారు.ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యక్తిగతంగా అభివృద్ధి చేసుకునే విద్యాభివృద్ధి విద్యాసంస్థల అభివృద్ధి ఏ విధంగా ముందుకు సాగుతుందో వాళ్లే గుర్తించాలంటూ తెలంగాణలో మాత్రం అన్ని విద్యాసంస్థలతో పాటు నూతనంగా రూపొందించబడే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్కు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని కొన్ని నియోజకవర్గాల్లో అప్పటికే పనులు ప్రారంభమయ్యాయని మరికొన్ని నియోజకవర్గాల్లో ప్రారంభోత్సవాలే మొదలై పనులు ముందుకు సాగడం లేదంటూ సూటిగా నిలదీశారు.తెలుగు రాష్ట్రాల్లో విద్యాసంస్థల్లో విపరీతంగా పెరిగిపోతున్న ర్యాగింగ్ భూతాలు ఎప్పుడు నియంత్రించబడతాయో తెలియదు కానీ ముక్కుపచ్చలారని విద్యార్థుల జీవితాలు నాశనం చేయబడుతుండడం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.విశ్వవిద్యాలయాలలో ర్యాగింగ్ పెంచి పోషిస్తున్నది కీచక మహాశయులేనంటూ సూటిగా నిలదీశారు.తెలుగు రాష్ట్రాల్లో ఎప్పుడూ లేని విధంగా మతపరమైన కులపరమైన సంఘాలు ఎక్కువగా పెరిగిపోతున్నాయని వాటిని పెంచి పోషిస్తున్న అధికారులను,అధ్యాపకులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అవసరమైతే శాశ్వతంగా ఉద్యోగాల్లోకెళ్లి తొలగించబడే చట్టాలను రూపొందించి ఉన్నత విద్యను ఉన్నతంగా కొనసాగించబడే విధంగా విశ్వవిద్యాలయాల్లో నూతనమైన విద్యా చట్టాలను రూపొందించాలని సూచించారు. విశ్వవిద్యాలయాల విద్యావ్యవస్థలలో ఒక్కసారైనా జైలుకు వెళ్లొచ్చినోళ్లను గుర్తించి వాళ్ళ ఉద్యోగ రికార్డులను పరిశీలించి శాశ్వతంగా ఉద్యోగంలో కెళ్ళి తొలగించే చట్టాన్ని త్వరితగతిన రూపొందించాలని ప్రభుత్వాలకు తెలియజేశారు.విద్యాలయాలలో అవినీతి అంచలంచలుగా పెరిగిపోతూనే ఉందన్నారు.ఉన్నత విద్యా అధికారులు ఎంత కఠినంగా ఉన్నా విశ్వవిద్యాలయాల్లో అవినీతి మాత్రం నియంత్రించబడడం కష్టతరంగా మారిపోయిందని గుర్తుకు చేశారు.అదే సందర్భంలో ప్రతి విశ్వవిద్యాలయంలో పార్ట్ టైం అధ్యాపకులుగా పనిచేస్తున్న అధ్యాపకుల జీవన విధానం దరిద్రమైన స్థితిలోనికి వెళ్లిందని ఇంకొంత కాలం అలాగే కొనసాగితే పార్ట్ టైం అధ్యాపకుల ఆత్మహత్యలు చూడాల్సి వస్తుందని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఇరు రాష్ట్రాలు మేనిఫెస్టోను అమలు చేసిన పార్ట్ టైం అధ్యాపకులకు కాస్తంత ఊరట లభిస్తుందని వాళ్ల జీవన విధానం పెంపొందించబడుతుందని గుర్తు చేశారు.2014 నుండి పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు 2018 లో జీవో నెంబర్ 11కు అనుకూలంగా,2022లో తీసుకువచ్చిన జీవో నెంబర్ 141 కు మరికొంతమందిని అనుకూలంగా పరిగణిస్తూ వేతనాలతో పాటు సర్వీస్ పెరుగుదల కల్పిస్తూ వాళ్లను ఆదుకోవాల్సిన బాధ్యత నువ్వు విశ్వవిద్యాలయాల వీసీ రిజిస్ట్రార్లపై ఉందని గుర్తు చేశారు.తెలుగు రాష్ట్రాల్లోని విద్యాపరమైన లైబ్రరీలకు ఉన్నతమైన నిధులు మంజూరు చేసి నూతనమైన పుస్తకాలను అందుబాటులోనికి తీసుకువచ్చి విద్యార్థులందరూ కాంపిటీటివ్ రాత పరీక్షలకు ఉన్నత స్థాయిలో సిద్ధపడే విధంగా ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, తగిన చొరవ చూపాలని కోరారు.అన్నింటికన్నా ప్రధానంగా విద్యా వ్యవస్థలలో విశ్వవిద్యాలయాల భూముల కబ్జాలపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు క్యాబినెట్ ఆమోదంతో పొందే విధంగా కఠినమైన చట్టాన్ని రూపొందించి భూకబ్జాదారులను శిక్షించాలని కోరారు.

**చదువు ఒక్కటే చక్కటి మార్గం..**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలోనే ఉన్నత డిగ్రీలు పొందిన మహనీయులుగా గుర్తింపు పొంది దేశ ప్రజలకు ఇచ్చినటువంటి ఏకైక ఆస్తి చదివేనని గుర్తు చేశారు బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన విధంగా పుస్తకాల ముందు తలలు వంచండి నిజజీవితంలో అవి మిమ్మల్ని తలెత్తుకునేలా చేస్తాయని చెప్పిన విధానాన్ని తప్పకుండా పాటించాలని విద్యార్థులకు సూచించారు.చదువు అనేది అనేక ప్రశ్నలకు దారితీస్తుందని.చదువు అనేది అనేక సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిస్తుందని.అందుకే ప్రభుత్వాలు చదువుకు కళ్లెంవేసి విద్యార్థులకు దూరం చేస్తుండగా కనీసం మనకు అందుబాటులో ఉన్న విద్య నైనా దూరం చేసుకోవద్దని సూచించారు.పేద విద్యార్థులకు ఆస్తులు అనేవి ఉండకపోవచ్చు గాని చదువునే పెద్ద ఆస్తిగా భావిస్తూ విశ్వాసంగా ముందుకు సాగగలిగితే సొసైటీలో గొప్ప గౌరవ మర్యాదలను పెంచుకోవడం పెద్దగా కష్టతరం కాదన్నారు.నిజాయితీగా జీవిస్తున్న వ్యక్తులు బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితాన్ని జ్ఞాపకం చేసుకోవాలని వివరిస్తూ అంబేద్కర్ కుటుంబ పోషణకే కష్టతరమైన జీవితాన్ని అనుభవించి దేశ రూపురేఖలను తలరాతలను మార్చే భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, రచించారని పేర్కొన్నారు.కష్టకాలంలో కడుపేద స్థితిలో పొందుతున్న అనుభవం, అనుభూతి విద్యాపరమైన అవరోధాలు,ఆటంకాలు మన జీవితాలలో బలమైన వ్యక్తులుగా తయారు కావడానికి దోహదపడగలమని గుర్తు చేశారు.మహనీయుల ఆశయాలను ఎలాగూ మోయలేని మనం భారతదేశ విద్యా వ్యవస్థ మతమార్పిడితో కళ్లెం వేయబడుతున్న వేళ దేశవ్యాప్తంగా ఉన్నటువంటి కనీసపు విద్యా ప్రమాణాలను అందిపుచ్చుకొని కష్టపడి చదువుకొని అభివృద్ధి చెందాలని తెలిపారు.దేశంలో విద్యా వ్యవస్థ ఎంత దరిద్రపు స్థితికి దిగజారిందో అన్ని రాష్ట్రాల్లో అదే పరిస్థితి కొనసాగుతుండగా విద్యార్థులు దురాలువాట్లకు, మత్తు పానీయాలకు, గంజాయి, తంబాకు, డ్రగ్స్,లాంటి మత్తు పదార్థాల అలవాట్లలో మునిగితేలుతూ వాటినే ఉన్నత విద్యగా భావించుకునే దుర్మార్గపు స్థితిలోనికి పడిపోతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యావిధానాలపై కట్టుదిట్టమైన నియమాలను విధిస్తూ నూతన చట్టాలను ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు అనుకూలంగా మలిచి వాళ్లు అభివృద్ధి చెందే విధంగా పాటుపడుతూ ప్రభుత్వాల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

# విద్యా, వైద్య రంగాల్లో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర

**కాకతీయ విశ్వవిద్యాలయంలో రీజినల్ స్థాయి ఎఐ కాన్‌క్లేవ్ - 2026**

**హన్మకొండ, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**






తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "రీజినల్ స్థాయి ఎఐ కాన్‌క్లేవ్ -- 2026" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఎఐ) విద్య, వైద్యం, వ్యవసాయం, పాలన తదితర రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందన్నారు. ముఖ్యంగా వ్యాధుల నిర్ధారణలో సీఎన్ఎన్, ఆర్ఎన్ఎన్, ఎల్.ఎస్.టి.ఎం వంటి డీప్ లెర్నింగ్ విధానాలు కీలకంగా మారాయని తెలిపారు. ఎఐ వినియోగంలో నైతికత, పారదర్శకత, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన ఆయన, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సదస్సులు విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తాయని అన్నారు. డాక్టర్ బి. రమ మాట్లాడుతూ భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు విస్తృత ఉద్యోగావకాశాలను సృష్టించనున్నందున విద్యార్థులు, అధ్యాపకులు తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యారంగంలో ఎఐ టూల్స్ వినియోగం అవసరమని పేర్కొన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న కేయూ చెందిన ఆచార్య డా. రామలింగస్వామి చెరకు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు అధ్యాపకులకు ప్రత్యామ్నాయం కాదని, బోధనను మరింత సమర్థవంతం చేసే శక్తివంతమైన సాధనమని తెలిపారు. ప్రస్తుతం ా× విద్య, వైద్య, పరిశోధన రంగాల్లో విస్తృత మార్పులకు కారణమవుతోందన్నారు. వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సా విధానాల ఎంపికలో ఎఐ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తుది నిర్ణయం మాత్రం మానవ మేధస్సుదేనని స్పష్టం చేశారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ పాఠ్యప్రణాళికలో ప్రతి సబ్జెక్టులో ఎఐ అంశాలను చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు ఆచార్య ఎన్. రమణ, ఆచార్య భిక్షాలు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. డా. సలోని ఫాతిమా స్వాగతం పలకగా, డా. నీలిమా వందన సమర్పణ చేశారు.

# కృత్రిమ మేధ ప్రాధాన్యత గుర్తించి ప్రగతి సాధించాలి

**పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్**

**హన్మకొండ, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), హనుమకొండలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌తో పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. కళాశాల ఫ్యాకల్టీ ఫోరం కన్వీనర్ రాంరెడ్డి, కల్చరల్ కమిటీ కన్వీనర్ డా. ఆర్. లక్ష్మీకాంతం, లిటరరీ కమిటీ కన్వీనర్ రామారత్నమాల, ఎన్ఎస్ఎస్ 1, 2, 3 యూనిట్ల ప్రోగ్రామ్ అధికారులు కవిత, డా. మమత, రత్నమాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులు కృత్రిమ మేధ ప్రాధాన్యతను గుర్తించి దానికి అనుగుణంగా ప్రగతి సాధించాలని సూచించారు. సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల్లో ప్రదర్శించే ప్రతిభ వ్యక్తిత్వ వికాసంతో పాటు మానసిక, శారీరక ఔన్నత్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఫ్యాకల్టీ ఫోరం పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధ విశిష్టతను వివరించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించగా, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు, లిటరరీ కమిటీ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు, కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఫ్యాకల్టీ ఫోరం కన్వీనర్ రాంరెడ్డి, కల్చరల్ కమిటీ కన్వీనర్ డా. ఆర్. లక్ష్మీకాంతం, లిటరరీ కమిటీ కన్వీనర్ రామారత్నమాల మాట్లాడుతూ కృత్రిమ మేధపై నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, విద్యా వారోత్సవాల సమన్వయకర్త డా. డి. రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# యువత మత్తు పదార్థలకు బానిసలు కావద్దు











**భవిష్యత్తు లక్ష్యసాధన కోసం తీవ్రంగా శ్రమించాలి**
**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**హైద్రాబాద్, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జాగృతి పోలీస్ కళాబృందం ద్వారా మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మహిళల వేధింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాగృతి కళాబృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు, విద్యార్థులకు చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ ఆధ్వర్యం వహించగా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, ఎస్‌బీ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, డాక్టర్లు ప్రశాంత్, ప్రహసిత్, సామాజికవేత్త ఆచార్య తదితరులు పాల్గొని విద్యార్థులు, యువతకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారంలోకి మారుతుందని పేర్కొన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం జరిపితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీ వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి, మద్యం సేవించి వాహనాలు నడపకుండా గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలో షీ టీమ్‌లు ఏర్పాటు చేశామని, ర్యాగింగ్, మహిళల వేధింపులు చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీపీ ధార కవిత మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, ర్యాగింగ్ వంటి ఘటనలను సహించబోమని తెలిపారు. బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపడుతోందని వివరించారు. ఎస్‌బీ ఏసీపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. సమాజంలో జరిగే అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, చైన్ స్నాచింగ్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రహసిత్ లు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో మాట్లాడాలని, అవసరమైతే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ప్రముఖ వక్త ఆచార్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో జీవిస్తేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దేవేందర్, రవి, గోవర్ధన్, సుజిత్, క్రైమ్ కానిస్టేబుల్ క్రాంతి కుమార్, ఎస్‌బీ సిరాజ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, హసన్‌పర్తి మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మండల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో చురుకుగా పాల్గొనాలి

**కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం**
**కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరో రోజు కార్యక్రమాలు**

**హన్మకొండ, 16 మే 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శనివారం కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్-ఎస్) ఆధ్వర్యంలో ఆరో రోజు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, మే 11 నుంచి 17 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమయపాలనతో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య కె. రాజేందర్, ఆచార్య నరసింహాచారి, డా. నరేందర్, డా. వెంకటేశ్వర్లు, డా. సీతారాం, సీనియర్ వాలంటీర్ శివతో పాటు ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



# అసలైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ

**కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ కే. కేశవరావు**
**సభ్యుడిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్**



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Committee to identify the "Telangana Udyamakarulu" and to make appropriate recommendations to recognize and honour their contributions and sacrifices – Constituted - Orders – Issued.

GENERAL ADMINISTRATION (CABINET) DEPARTMENT

G.O.Rt.No.679 Dated:15.05.2026

****

ORDER

The Telangana State was formed after a prolonged, multi-phase agitation. Some activists were martyred during the movement, while few others suffered physical impairment. Many were implicated in cases and incarcerated. There has been a longstanding demand to acknowledge and honour the contributions of 'Telangana Udyamakarulu' involved in various phases of the movement.

2. In order to identify the 'Telangana Udyamakarulu' and make appropriate recommendations to recognize and honour their contributions and sacrifices, a Committee with the following composition is hereby constituted:

| | | |
|---|---|---|
| 1. | Dr.K.Keshava Rao, Advisor to Govt., (Public Relations & Education) | - Chairman |
| 2. | Sri Ponnam Prabhakar, Hon'ble Minister for Transport & BC Welfare | - Member |
| 3. | Prof. M.Kodandaram, MLC | - Member |
| 4. | Sri Addanki Dayakar, MLC & Whip | - Member |
| 5. | Sri S.Ramulu Naik, Ex-MLC | - Member |
| 6. | Sri Mothe Shoban Reddy | - Member |

3. The Secretary to Government (Poll.), General Administration Department shall be the Convenor of the Committee.

4. The terms of reference of the committee are as follows:

i. To evolve and establish criteria for identification of "Telangana Udyamakarulu".
ii. To identify and prepare the list of "Telangana Udyamakarulu" as per the evolved criteria.
iii. To make recommendations regarding the nature of recognitions/honours/courtesies/facilities to be extended to the said "Telangana Udyamakarulu".

5. The Committee shall call officers, call for information, hold meetings for this purpose. The Committee can also call such other persons/officers deemed fit for conducting its proceedings.

6. The Committee shall submit its report / recommendations to the Government expeditiously.

7. All the officers / Secretaries shall extend necessary cooperation as required by the Committee.

8. General Administration Department is requested to take necessary action accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

K. RAMAKRISHNA RAO
CHIEF SECRETARY TO GOVERNMENT

To
The Hon'ble Chief Minister.
The Hon'ble Chairman and Members concerned.
The Hon'ble Deputy Chief Minister and all other Hon'ble Ministers.
The Vice-Chairman, Planning Board.
The Secretary to Government (Poll.), General Administration Department.

(P.T.O)

**హైద్రాబాద్, 16 మే 2026 (జై భీమ్ న్యూస్)**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు--త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో పలువురు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. అనేక మంది ఉద్యమకారులపై కేసులు నమోదై జైలు జీవితం కూడా గడిపారు. వారి సేవలను అధికారికంగా గుర్తించి గౌరవించాలని చాలాకాలంగా వస్తున్న డిమాండ్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం పేర్కొంది. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేసి, వారికి కల్పించాల్సిన గుర్తింపు, గౌరవం, సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయనుంది. కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకుని సమాచారం సేకరించవచ్చని, సమావేశాలు నిర్వహించవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం సూచించింది.

# కాకతీయ యూనివర్సిటీ కే హబ్ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ మద్దతు

**జూలై 2026లో తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌కు శ్రీధర్ బాబు ప్రారంభం**



**హైద్రాబాద్, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కే హబ్ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఽ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు ఽ వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రూసా 2.0 నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కే - హబ్ మరియు హైదరాబాద్‌లోని టి - హబ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) గురించి వైస్-చాన్సలర్ మంత్రికి వివరించారు. అలాగే జూలై 2026లో కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సమర్పించారు. హ్యాకథాన్ కార్యక్రమాన్ని స్వయంగా ప్రారంభించేందుకు మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ యువతలో ఆవిష్కరణ, ఇంక్యూబేషన్, స్టార్టప్ సంస్కృతి, పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి కాకతీయ విశ్వవిద్యాలయం చేపడుతున్న కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత రెండో స్థాయి నగరాలలో స్టార్టప్ కార్యకలాపాలకు వరంగల్ కేంద్రంగా ఎదగాలని, కాకతీయ విశ్వవిద్యాలయం కే - హబ్ తెలంగాణలో ఆవిష్కరణలు, ఉద్యమితకు ప్రముఖ కేంద్రంగా రూపుదిద్దుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

# దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**



**వరంగల్, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సమగ్ర శిక్ష తెలంగాణ, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద 99 మంది దివ్యాంగ విద్యార్థులకు మొత్తం 115 సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎప్పుడూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి దివ్యాంగుడిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మనోవికాస కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను వెలికితీయాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో ఆగస్టు నెలలో నిర్వహించిన అసెస్మెంట్ క్యాంపులో అర్హులుగా గుర్తించిన విద్యార్థులకు ఈ ఉపకరణాలను అందజేశారు. వీటిలో బ్రెయిలీ కిట్లు, మొబైల్ ఫోన్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు తదితర అవసరమైన సహాయక పరికరాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, సీఎంఓ, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డా. కె. శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డా. సాంబశివరావు, మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, ప్రత్యేక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటా

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**హన్మకొండ, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన టియూడబ్ల్యూజె (ఐజెయూ) మహాసభకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని అన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. ప్రజల కోసం కష్టనష్టాలను ఎదుర్కొంటూ పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్య భద్రత, ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్ తదితర అంశాల్లో ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం టియూడబ్ల్యూజె (ఐజెయూ) జిల్లా నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముందు విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశాం: సైబరాబాద్ సీపీ

**నార్సింగిలోని పోలీస్ అకాడమీ వద్ద అరెస్టు చేసినట్లు వెల్లడి**

**పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామన్న సీపీ**

**ఈ నెల 8న బండి భగీరథ్‌పై పోక్సో కేసు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మైనర్ బాలిక కుటుంబం ఫిర్యాదుతో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈరోజు పోలీసుల ఎదుట బండి భగీరథ్ లొంగిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఈ అంశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్పందించారు. బండి భగీరథ్‌ను నార్సింగిలోని పోలీస్ అకాడమీ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. అతడిని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామని అన్నారు. ఈ నెల 8వ తేదీన బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. కాసేపట్లో పోలీసులు అతనిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. బండి భగీరథ్ దేశం దాటి వెళ్ళిపోకుండా పోలీసులు ఇటీవల లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఐదు బృందాలతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

# డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య





**హన్మకొండ, 15 మే 2026(జై భీమ్ న్యూస్)**

డెంగ్యూ వ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రభుత్వ విభాగాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మచిలీబజార్ జీడబ్ల్యూఎంసీ కమ్యూనిటీ హాల్ నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగరపాలక సంస్థ అర్బన్ మలేరియా విభాగం, కెఎంసి నర్సింగ్ కళాశాల సహకారం అందించాయి. డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్యతో పాటు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, కెఎంసి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు. ప్లకార్డులు, నినాదాలతో సాగిన ఈ ర్యాలీ హనుమకొండ బస్టాండ్ మార్గంలో హనుమాన్ జంక్షన్ వరకు కొనసాగి అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, జూన్ నెలలో వర్షాకాలం ప్రారంభమవడంతో నీటి నిల్వలు పెరిగి దోమల వ్యాప్తి అధికమయ్యే అవకాశం ఉందన్నారు. అందుకే ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 2025 సంవత్సరంలో 179 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు కాగా, 2026 జనవరి నుంచి ఇప్పటివరకు 13 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. జీఎంహెచ్ పరిధిలో గత ఏడాది 21 కేసులు, మచిలీబజార్ ప్రాంతంలో ఆరు కేసులు నమోదవడంతో ఈ ప్రాంతంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం “డ్రై డే” పాటిస్తూ ఇళ్లలో నీరు నిల్వ ఉండే పాత్రలను ఖాళీ చేసి ఆరబెట్టి తిరిగి వినియోగించాలని సూచించారు. లేకపోతే వాటిలో దోమలు గుడ్లు పెట్టి లార్వా పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. మదన్ మోహన్ రావు మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జీడబ్ల్యూఎంసీ సిబ్బందితో, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ శాఖతో సమన్వయంగా దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. ముఖ్యంగా పగిలిన డబ్బాలు, డ్రమ్ములు, నీటి కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రభుదాస్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, జీఎంహెచ్ వైద్యాధికారులు డాక్టర్ అనిల్, డాక్టర్ గీత, హెచ్ఈఈఓలు ఎల్. చంద్రశేఖర్, ఎస్. శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారులు ఖాదర్ అబ్బాస్, పి. విప్లవ్ కుమార్, పిహెచ్ఎన్ రామేశ్వరి, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు స్రవంతి, జ్యోతి, మాలవిక, సాహితి, రాణి తదితరులు పాల్గొన్నారు. అర్బన్ మలేరియా విభాగ సిబ్బంది స్ప్రే పంపులు, ఫాగింగ్ మిషన్ల ప్రదర్శన నిర్వహించారు.

# 480 గ్రాముల జుట్టు, రబ్బరు తిన్న రెండేళ్ల బాలికను కాపాడిన మెడికవర్ ఆసుపత్రి వైద్యులు

**బెంగళూరు వైట్‌ఫీల్డ్ జై భీమ్ న్యూస్ :**

అరుదైన, ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న రెండేళ్ల బాలిక ప్రాణాలను మెడికవర్ ఆసుపత్రి ఆ వైద్యులు విజయవంతంగా కాపాడారు. ఈ కేసులో శిశువైద్యురాలు డాక్టర్ లీనాత రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆమె “రాపుంజెల్ సిండ్రోమ్” అనే అరుదైన వ్యాధిని నిర్ధారించి, చికిత్స అందించారు. ఆ చిన్నారికి చిన్నప్పటి నుంచి జుట్టు, రబ్బరు బ్యాండ్లు, బెలూన్ ముక్కల వంటి తినకూడని వస్తువులను తినే వింత అలవాటు ఉండేది. దీని ఫలితంగా కడుపులో ఒక పెద్ద జుట్టు ఉండ (ట్రైకోబెజోర్) ఏర్పడి, అది కడుపు నుంచి చిన్న ప్రేగుల వరకు వ్యాపించింది. ఈ అరుదైన వ్యాధిని “రాపుంజెల్ సిండ్రోమ్” అంటారు. ఇది సాధారణంగా ప్రీస్కూల్ వయస్సు పిల్లలలో సంభవిస్తుంది. అయితే, రెండేళ్ల చిన్నారిలో ఇది కనిపించడం అత్యంత అరుదు. ఆ చిన్నారి కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పి, నిరంతర వాంతులు, సరిగ్గా ఆహారం తీసుకోకపోవడంతో బాధపడుతోంది. ఇది ఆ కుటుంబాన్ని ఆందోళనకు గురిచేసింది. వైద్య పరీక్ష సమయంలో, కడుపు నుండి చిన్న ప్రేగు వరకు విస్తరించి ఉన్న ఒక పెద్ద వెంట్రుకల ముద్ద జీర్ణం కావడానికి మరియు బయటకు వెళ్ళడానికి కష్టంగా ఉన్నట్లు గుర్తించారు. మొదట, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రూపేష్ కళ్యాణ్ ఎండోస్కోపీ ద్వారా దానిని తొలగించడానికి ప్రయత్నించారు. అయితే, ఆ ముద్ద యొక్క పరిమాణం మరియు విస్తరణ కారణంగా శస్త్రచికిత్స అవసరమైంది. మెడికవర్ ఆసుపత్రికి చెందిన నలుగురు వైద్యుల బృందం లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. సుమారు 25 సెం.మీ పొడవు, 480 గ్రాముల బరువున్న ఆ పెద్ద వెంట్రుకల ముద్దను విజయవంతంగా తొలగించి, ఆ చిన్నారి ప్రాణాలను కాపాడారు. ఆ చిన్నారి ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉంది మరియు త్వరగా కోలుకుంటోంది. డాక్టర్ లీనాథ్ రెడ్డి మాట్లాడుతూ “చిన్న పిల్లలలో పైకా సమస్యను తరచుగా ప్రారంభ దశలలో విస్మరిస్తారు. తల్లిదండ్రులు దాని తీవ్రతను గ్రహించేలోపే, తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. కొన్ని సందర్భాల్లో, ఇది రాపుంజెల్ సిండ్రోమ్ వంటి ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు. పిల్లలకు తినకూడని పదార్థాలు తినే అలవాటు ఏర్పడితే, వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా అవసరం,” అని అన్నారు. వైద్యుల ప్రకారం, పైకా సమస్య తరచుగా ఐరన్ లోపం అనీమియాతో సహా పోషకాహార లోపాలతో ముడిపడి ఉంటుంది. సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. తమ పిల్లల ఆహారపు అలవాట్ల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సంఘటన మరోసారి గుర్తుచేస్తోంది. ఆ చిన్నారి కుటుంబానికి పోషకాహార సహాయం, మానసిక వైద్య మూల్యాంకనం, మరియు క్రమం తప్పని వైద్య పర్యవేక్షణ పొందాలని సలహా ఇవ్వబడింది.








# అత్యాధునిక విద్యను అందిస్తున్న పింగిళి డిగ్రీ కళాశాల

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




**హన్మకొండ, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

నాయిని రాజేందర్ రెడ్డి పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) విద్యార్థినులకు అత్యాధునిక, నాణ్యమైన విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, విద్యా వారోత్సవాల సందర్భంగా పింగిళి కళాశాల 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ పోస్టర్‌ను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కళాశాలలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్ తదితర అన్ని విభాగాల్లో ఆధునిక బోధన అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాలలో బి.ఏ, బి.కాం కంప్యూటర్స్, బీకాం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్స్యూరెన్స్, బీబీఏ, బీఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్, డైరీ, పౌల్ట్రీ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలకు జాతీయ స్థాయి న్యాక్ ‘ఏ’ గ్రేడ్ గుర్తింపు, అటానమస్ హోదా లభించిందని చెప్పారు. అలాగే సుశిక్షితులైన అధ్యాపకులు, అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు జాబ్ మేళాల ద్వారా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కళాశాల ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఆరవ రోజు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, విద్యా వారోత్సవాల సమన్వయకర్త డా. డి. రామకృష్ణారెడ్డి, డా. లకన్ సింగ్, డా. రాజిరెడ్డి, డా. రేణుక, డా. మాధవి తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలి

**చదువుతోపాటు కళలు, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి**
**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
**ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీ పాఠశాలలో విద్యా వారోత్సవాల సందర్భంగా ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ డే నిర్వహణ**

**హన్మకొండ, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు చదువుతోపాటు కళలు, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించి సర్వతోముఖాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీ పాఠశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో "ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ డే" వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా



కలెక్టర్‌కు విద్యార్థినులు కోలాటంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ఆర్ట్, క్రాఫ్ట్ వస్తువులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను, చిత్రలేఖనాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు రూపొందించిన కళాఖండాల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించేలా అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ఆర్ట్, క్రాఫ్ట్ వస్తువులు ఎంతో సృజనాత్మకంగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. కేజీబీవీల్లో ఆర్ట్, క్రాఫ్ట్ అంశాలపై శిక్షణ అందించేందుకు వృత్తి నిపుణులైన ఇన్‌స్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు ఇది మంచి అవకాశమని చెప్పారు. విద్యా అంటే కేవలం పుస్తకాలు చదివి మంచి మార్కులు, ర్యాంకులు సాధించడం మాత్రమే కాదని, విద్యార్థి యొక్క సర్వతోముఖాభివృద్ధి ఆల్‌రౌండ్ డెవలప్మెంట్ అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సంగీతం, నృత్యం వంటి కళల ద్వారా విద్యార్థుల మేధస్సు అభివృద్ధి చెందుతుందని శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ



పిల్లలు చదువుతోపాటు ఇతర రంగాల్లో ప్రతిభ కనబరచేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉపయోగంలో లేని వస్తువులను పునర్వినియోగం చేసి వినూత్న క్రాఫ్ట్ ఉత్పత్తులను తయారు చేయడం పట్ల విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సమాజం, ప్రకృతి పట్ల బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ బాలభవన్ విద్యార్థులు "ఏకదంతాయ వక్రతుండాయ" గీతానికి, జయగిరి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు బంజారా గీతానికి చేసిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్, ఎడ్యుకేషన్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, జీసీఈఓ సునీత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధ ప్రాధాన్యత గుర్తించి దానికి అనుగుణంగా ప్రగతి సాధించాలి!







**ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి**

**హనుమకొండ వడ్డేపెల్లి 16 మే 2016(జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) హనుమకొండ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా ఆరవవ రోజు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై ఫాకల్టీ డెవెలప్ మెంట్ ప్రోగ్రామ్ మరియు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందనీ కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి అన్నారు.కళాశాల ఫాకల్టీ ఫోరం కన్వీనర్ రాంరెడ్డి,కల్చరల్ కమిటీ కన్వీనర్ డా. ఆర్. లక్ష్మీకాంతం, లిటరరీ కమిటీ కన్వీనర్ రామారత్నమాల, ఎన్ ఎస్ ఎస్ 1,2,3 యూనిట్ ల ప్రోగ్రామ్ అధికారులు కవిత, డా. మమత,రత్నమాల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై ఫ్యాకల్టీ డెవెలప్ మెంట్ ప్రోగ్రామ్,ఇతర సాహిత్య, సాంస్కృతిక, ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందనీ విద్యార్థులు అందరూ కృత్రిమ మేధ ప్రాధాన్యత గుర్తించి దానికి ఏనుగుణంగా ప్రగతి సాధించాలని, సాహిత్య సాంస్కృతిక,కళా రంగాలలో ప్రదర్శించే ప్రతిభ వ్యక్తిత్వ వికాసాన్ని, మానసిక,శారీరక ఔన్నత్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఫోరం కన్వీనర్ రాంరెడ్డి,కల్చరల్ కమిటీ కన్వీనర్ డా ఆర్ లక్ష్మీ కాంతం,లిటరరీ కమిటీ కన్వీనర్ రామారత్నమాల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు కళాశాలలో కృత్రిమ మేధ ప్రాధాన్యతను తెలిపే ఎఫ్ డి పి, ఇతర సాహిత్య ,సాంస్కృతిక, ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందనీ ఇవి సృజనాత్మక నైపుణ్యాన్ని గుర్తించడానికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. ఫ్యాకల్టీ ఫోరం పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధ విశిష్ఠతను వివరించే ఎఫ్ డి పి ప్రోగ్రామ్,ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన, డిబేట్, క్విజ్, లిటరరీ కమిటీ ఆధ్వర్యంలో వక్తృత్వం,కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి సుహాసిని, ఐ క్యూ ఎ సి కో ఆర్డినేటర్, డా. సురేష్ బాబు అకాడమిక్ కోఆర్డినేటర్ డా.ఎం.అరుణ, విద్యా వారోత్సవాల సమన్వయకర్త డా.డి. రామకృష్ణారెడ్డి, ఫ్యాకల్టీ ఫోరం కన్వీనర్ రాంరెడ్డి,కల్చరల్ కమిటీ కన్వీనర్ డా ఆర్. లక్ష్మీకాంతం, లిటరరీ కమిటీ కన్వీనర్ రామారత్నమాల, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కవిత, మమత,రత్నమాల, అధ్యాపకులు పీడీ సుజాత, ఎస్.మధు,డా. కె. శ్రీనివాస్, డా. సామ్యూల్ ప్రవీణ్ కుమార్, ప్రొ. ప్రశాంతి, ప్రొ.సునీత,ఉదయశ్రీ , జ్యోతి,డా.సునీత, డా.సారంగపాణి, డా.లకన్ సింగ్, రాజేశ్వరి, డా. పి.పద్మ , డా.అరుణ, జ్యోతిర్మయి, డా. రాజిరెడ్డి, రమేష్ కుమార్, డా.మాధవి,అరుణ, స్వర్ణలత, ప్రతిభ,కమిటీ సభ్యులు మరియు వివిధ విభాగాల అధిపతులు,సమన్వయకర్తలు, భోధన బోధనేతర సిబ్బంది,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓయూ సీఐ మహేష్, డీఐ లెనిన్‌లకు ఘన సన్మానం

**ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్న పోలీస్ అధికారుల సేవలు అభినందనీయం**
**జై భీమ్ సంస్థల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ**

**హైద్రబాద్, 16 మే 2026 (జై భీమ్ న్యూస్)**

జై భీమ్ సంస్థల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ఓయూ సీఐ మహేష్, ఓయూ డీఐ లెనిన్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా చిరు సన్మానం నిర్వహించారు. ప్రజల భద్రత, విద్యార్థుల సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కష్టపడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సమాజంలో శాంతి, న్యాయం, భరోసాను నిలబెట్టే పోలీస్ వ్యవస్థకు అండగా నిలుస్తున్న ఇలాంటి అధికారులను కలవడం ఆనందంగా అనిపించిందని తెలిపారు. ప్రజల కోసం అంకితభావంతో పని చేస్తున్న పోలీస్ అధికారుల సేవలు సమాజానికి ఆదర్శమని పేర్కొంటూ, వారి సేవలను అభినందిస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.





# తెలంగాణ ఉద్యమకారుల విజయానికి నాంది

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిలువేరు రమేష్**



**హన్మకొండ, 16 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా వివిధ రూపాల్లో కొనసాగుతున్న ఉద్యమానికి నిన్న నిర్వహించిన ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమంతో కార్యరూపం దాల్చిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిలువేరు రమేష్ తెలిపారు. ఈ విజయం తెలంగాణ ఉద్యమకారులందరికీ అంకితమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు భాషబోయిన రవీందర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యమకారులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం నియమించిన కమిటీ కట్టుబడి పనిచేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నిన్న ప్రజాభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బృందానికి సమయం కేటాయించి ఉన్నతాధికారులతో చర్చలు జరిపించడం జరిగిందన్నారు. అలాగే సచివాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఐఏఎస్ ను కూడా కలిసినట్లు తెలిపారు. సీఎం ఉద్యమకారుల సమస్యలపై సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. అలస్యం లేకుండా జీవో 679 విడుదలకు సహకరించిన చిన్నారెడ్డికి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఐఏఎస్ కి, రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యమకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోతరాజు ప్రభాకర్, కుక్కల జ్ఞానేశ్వర్, పెద్దిరాజు, తొడేటి బాబు తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# నా కుమారుడ్ని పోలీసులకు అప్పగించాను

**బండి సంజయ్ సంచలన ప్రకటన**
**పోక్సో కేసులో పోలీసులకు లొంగిపోయిన బండి భగీరథ్**
**కుమారుడిని తానే న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించానని ప్రకటించిన బండి సంజయ్**
**చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసిన కేంద్రమంత్రి**
**తాను ఏ తప్పు చేయలేదని భగీరథ్ చెబుతున్నాడన్న సంజయ్**
**త్వరలోనే బెయిల్ వస్తుందని ఆశాభావం**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన కుమారుడిని న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించినట్లు బండి సంజయ్ స్వయంగా వెల్లడించారు. ఈ కేసులో చట్ట ప్రకారం విచారణకు సహకరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. "చట్టం ముందు నా కుమారుడు అయినా, సామాన్యుడు అయినా అందరూ సమానమే. పోలీసులపై ఉన్న గౌరవంతోనే భగీరథ్‌ను అప్పగించాను. అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందే" అని స్పష్టం చేశారు. తన కుమారుడు ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని, ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలను న్యాయవాదుల ద్వారా పోలీసుల ముందు ఉంచినట్లు వివరించారు. వాస్తవానికి, ఈ ఫిర్యాదు వచ్చినప్పుడే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని భావించినట్లు సంజయ్ పేర్కొన్నారు. ఆధారాలను చూపేందుకే ఆలస్యం అయిందని అన్నారు. ఇంకా జాప్యం చేయడం భావ్యం కాదని తన బిడ్డను పోలీసులకు అప్పగించినట్టు వివరించారు. ఆధారాలను పరిశీలించి కేసును కొట్టివేస్తారని, తప్పకుండా బెయిల్ వస్తుందని న్యాయవాదులు చెప్పారని ఆయన అన్నారు. ఇవాళే బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక కుటుంబం చేసిన ఫిర్యాదు మేరకు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే.

## పోట్టేళ్ల పోట్లాట... మధ్యలోకి వెళ్లిన కాపరి బలి!

**ఖమ్మం, జై భీమ్ న్యూస్**

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఉప్పలచెలక గ్రామంలో ఘోరం జరిగింది. రెండు పొట్టేళ్ళ మధ్య జరిగిన పొట్లాటను ఆపబోయిన గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉప్పలచెలక గ్రామానికి చెందిన కుటుంబరావు అదే గ్రామానికి చెందిన వీర్రాజు అనే రైతు వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన కుటుంబరావు గొర్రెలను మేపడానికి గ్రామంలోని కొత్తచెరువు ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అక్కడ రెండు పొట్టేళ్ళు తీవ్రంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. దీంతో వాటిని ఆపడానికి కుటుంబరావు వెళ్ళాడు. అప్పటికే ఆవేశంగా కొట్టుకుంటున్న రెండు పొట్టేళ్ళు మధ్యలోకి వచ్చిన కుటుంబరావుపై దాడి చేశాయి. పొట్టేళ్ళ దాడిలో తీవ్రంగా గాయపడిన కుటుంబరావు స్పృహతప్పి పడిపోయాడు. సమీపంలోనే పశువులను కాస్తున్న ఓ మహిళ గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు 108కి సమాచారం ఇచ్చారు. అతనిని సమీపంలోని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి: ప్రధాని మోదీకి కవిత లేఖ

**ప్రధాని మోదీకి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత లేఖ**
**కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను తొలగించాలని డిమాండ్**
**కుమారుడిపై పోక్సో కేసు నమోదు కావడమే ఇందుకు కారణం**
**హోం శాఖ మంత్రిగా ఉంటే దర్యాప్తు ప్రభావితమవుతుందని ఆరోపణ**
**నిష్పక్షపాత విచారణ కోసం బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడమే కవిత డిమాండ్‌కు ప్రధాన కారణం. "కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తు, తదుపరి విచారణ పూర్తి స్వాతంత్ర్యంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కవిత తన లేఖలో నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే, ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. "అందువల్ల ఈ కేసులో విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కవిత కోరారు. ఈ చర్య ద్వారా మైనర్ల భద్రతకు, న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందని ఆమె పేర్కొన్నారు. 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'..

**జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ**
**జూన్ 25 నుంచి జులై 24 వరకు వెరిఫికేషన్ ప్రక్రియ**
**ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు**
**జులై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల**
**జులై 31-ఆగస్టు 30 మధ్య అభ్యంతరాల స్వీకరణ**
**అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో వచ్చే నెల 15 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాతో పంచుకున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు అందుతాయన్నారు. అందులో ఒకటి నింపి తిరిగి బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రెండో ఫామ్‌ను ఓటరు తమ వద్దే అక్‌నాలెడ్జ్‌మెంట్ కింద ఉంచుకోవచ్చని వివరించారు. ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు కోసం జశీవతీం.వఒఱ.గ్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫామ్‌ల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. దీన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. అలాగే వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలియజేయొచ్చని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు. తెలంగాణలో దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు.

# ఎన్నారైకి రూ.24 కోట్ల మేర టోకరా వేసిన తెలంగాణ నేత!

**బీజేపీ నేత గజ్జల యోగానంద్‌పై రూ.24.53 కోట్ల మోసం కేసు**
**వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో ఎన్ఆర్ఐకి టోకరా**
**డబ్బు తీసుకుని షేర్లు బదిలీ చేయలేదని బాధితుడి ఫిర్యాదు**
**సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో కేసు నమోదు**
**విశ్వాసం కోసం ఒప్పందం చేసుకుని కూడా మోసగించారని ఆరోపణ**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో ఓ ఎన్ఆర్ఐని రూ.24.53 కోట్లు మోసం చేశారన్న ఆరోపణలపై బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త గజ్జల యోగానంద్‌పై కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. పోలీసుల కథనం ప్రకారం, అమెరికాలో నివసించే పవన్ కుమార్ నల్లమల అనే ఎన్ఆర్ఐకి, మంజీరా హోటల్స్ అధినేత అయిన యోగానంద్‌తో 2014 నుంచి వ్యాపార పరిచయం ఉంది. 2019లో పవన్ కుమార్ భారత్‌కు వచ్చినప్పుడు, తన వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని యోగానంద్ నమ్మించారు. ఆయన మాటలు విశ్వసించిన పవన్ కుమార్, 2019 నుంచి 2024 మధ్య విడతల వారీగా మొత్తం రూ.24.53 కోట్లు పెట్టుబడిగా సమకూర్చారు. అయితే, డబ్బు తీసుకున్న యోగానంద్.. ఆ మొత్తానికి సంబంధించిన షేర్లను పవన్ కుమార్ పేరిట బదిలీ చేయలేదు. బాధితుడు పలుమార్లు అడిగినా స్పందన లేకపోవడంతో, 2024 నవంబర్‌లో విశ్వాసం కోసం ఇరువురి మధ్య ఒక అవగాహన ఒప్పందం కూడా జరిగింది. నిధులు అందినట్లు అంగీకరిస్తూ, త్వరలోనే షేర్ల బదిలీ పూర్తి చేస్తానని యోగానంద్ ఆ ఒప్పందంలో హామీ ఇచ్చారు. ఆ హామీతో పవన్ కుమార్ అమెరికా వెళ్లగా, వాట్సాప్ ద్వారా సంప్రదించినప్పుడు యోగానంద్ తప్పించుకు తిరిగారని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తయిందని తప్పుడు సమాచారం ఇచ్చారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025 డిసెంబర్‌లో భారత్‌కు తిరిగొచ్చి ఆరా తీయగా, షేర్లు తన పేరు మీదకు బదిలీ కాలేదని తెలియడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు






**భవిష్యత్తు లక్ష్యసాధన కోసం తీవ్రంగా శ్రమించాలి**
**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

హైద్రాబాద్, 16 మే 2026(జై భీమ్ న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జాగృతి పోలీస్ కళాబృందం ద్వారా మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మహిళల వేధింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాగృతి కళాబృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు, విద్యార్థులకు చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ ఆధ్వర్యం వహించగా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, ఎస్‌బీ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, డాక్టర్లు ప్రశాంత్, ప్రహసిత్, సామాజికవేత్త ఆచార్య తదితరులు పాల్గొని విద్యార్థులు, యువతకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారంలోకి మారుతుందని పేర్కొన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం జరిపితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీ వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి, మద్యం సేవించి వాహనాలు నడపకుండా గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలో షీ టీమ్‌లు ఏర్పాటు చేశామని, ర్యాగింగ్, మహిళల వేధింపులు చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీపీ ధార కవిత మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, ర్యాగింగ్ వంటి ఘటనలను సహించబోమని తెలిపారు. బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపడుతోందని వివరించారు. ఎస్‌బీ ఏసీపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో జరిగే అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, చైన్ స్నాచింగ్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రహసిత్ లు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో మాట్లాడాలని, అవసరమైతే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ప్రముఖ వక్త ఆచార్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో జీవిస్తేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దేవేందర్, రవి, గోవర్ధన్, సుజిత్, క్రైమ్ కానిస్టేబుల్ క్రాంతి కుమార్, ఎస్‌బీ సిరాజ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, హసన్‌పర్తి మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మండల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.5 లక్షల చెక్కు అందజేత





**బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ బరిగెల శివ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్**

హైద్రాబాద్, 16 మే 2026(జై భీమ్ న్యూస్)

ప్రజల కష్టసమయంలో అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని మరోసారి నిరూపితమైంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును గ్రామ నివాసి గజవెల్లి ప్రభాకర్ గారి భార్యకు అత్యంత వేగంగా అందజేశారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్పందించిన డాక్టర్ బరిగెల శివ కుటుంబ సభ్యులను స్వయంగా తీసుకుని వెళ్లి తెలంగాణ సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ ను కలిపి, సహాయం వెంటనే అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అడిగిన వెంటనే స్పందించి మానవత్వంతో సహాయం చేసిన వేముల శ్రీనివాస్ సేవాభావాన్ని కుటుంబ సభ్యులు హృదయపూర్వకంగా కొనియాడారు. "మానవ సేవే మాధవ సేవ" అనే భావంతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ, ప్రజల బాధను తమ బాధగా భావించి స్పందించే అధికారులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వం మరింత భరోసాగా నిలవాలని ఆయన అభిప్రాయపడ్డారు. బాధలో ఉన్న ఒక కుటుంబానికి ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా ధైర్యం, నమ్మకం, భరోసా కూడా అందించిన ఈ సేవను గ్రామ ప్రజలు అభినందించారు.

